


౧

శ్రీ విభుసన్నిభ ప్రభవ
రేణ్యా, యనాథశరణ్యా, కృష్ణరా
యా, వివరంబుగా నరయు
మా: భవదంగన యన్నపూర్ణమా
దేవి యపాయముల్ తొలఁగి
దేవరకున్ నిరతంబు శ్రేయమే
కావలె నంచుఁ బంపె హిత
గర్భితమైన యుగాది కానుకల్.

పసుపురాసిన తాటియాకుమీఁది పయిపద్యమును బ్రాహ్మణుఁ డొకఁడు చదివి, రాయలవారి చేతి కందించి నంతనే, యుగాది కానుకలతోడి పైఁడిపళ్లెరము దాసి నేలకు దించి చేతులు జోడించి నిలిచినది.

గరుత్మంతుని ముక్కు గలిగి, కనక కుండలములు కర్ణములందుఁ దాల్చి, కాశ్మీరపు సేలువ శరీరమునఁ గప్పుకొని, సింహాసనమున కెదుట నిలుచున్న యా బ్రాహ్మణుని జూచి గంభీరమైన కంఠధ్వనితో, "మీపే రేమి?" అని రాయలవారు ప్రశ్నించిరి.

ప్రశ్నావాక్యము కందముగా నైనను, శార్దూలముగా నైనను మొదలుపెట్టుటకుఁ దగియున్నది. తన్ను దర్శింపవచ్చిన విద్వాంసులు కవులగుదురో కారో తెలిసికొనునిమిత్తము రాయల ప్రథమప్రశ్నలు పద్యరూపములుగా నుండునని మును వినియున్న యా బ్రాహ్మణుఁడు ప్రత్యుత్తరము సమస్యాపూర్తి వడువున నుడువఁగాఁ, బ్రశ్నోత్తరము లిట్లు తేలినవి :

శా. "మీపేరేమి?" "రిపుప్రకాండముల భూ
మిం బేరు లేకుండఁగా
రూపుల్ మాపి, యశోవిసర్జ జమిలి క
ర్పూరంపుఁ బేరుల్ దళం
బౌ పోల్కిం గకుబంగనాగళములం
దందంబుగా వైచు నో
క్ష్మాపాలోత్తమ, నంది తిమ్మకవి నాఁ
గాఁ బేరు నేఁ గాంచితిన్."

"ముద్దుపలుకులుగల ముక్కుతిమ్మనవటయ్యా?" అని రాయ లచ్చెరువునఁ బ్రశ్నించిరి.

ఆప్రశ్న యయత్నపూర్వకముగా ఛందోబద్ధమై యాటవెలఁది యాటకుఁ దగియున్నందునఁ, గవి ప్రత్యుత్తరమునఁ బద్యము పూర్తిచేసెను. సంపూర్ణ పద్యము:

ఆ.వె. "ముద్దు పల్కులు గల ముక్కు తిమ్మనవట-
యయ్య?" "వదాన్యమున నవాంబుముక్కు-
వగుట, ముద్దు పల్కు లాడె మత్కవితాకు-
మారి వానపుల్గు మాడ్కి నధిప."

సంతోష మిముడక "సెబా"సని రాయలవారు తొడ చఱచుకొని, "మేము మున్ను విన్నదానికి, నేఁడు ప్రత్యక్షముగాఁ గన్నదానికి సరిదాఁకి యున్నది. అల్లసాని పెద్దన గారిది యల్లిక జిగిబిగి; ధూర్జటి కవిది పలుకులమాధురి; మాదయగారిమల్లనకవిది రసపుష్టి. ముక్కుతిమ్మనకవీంద్రా, ముద్దుపలుకు మీసొమ్ము," అని ప్రశంసించిరి.

ఆస్తుతికి ముఖము వికసింపఁగా, "మహాప్రభూ, ఆంధ్రభోజులరని విఖ్యాతి గన్న దేవరవారి ముఖచంద్రమండలము చూచిన వారికి సుధాసదృశమైన కవిత యూరుట యబ్బురము కాదు. ఏలిన వారు పేర్కొనిన పెద్దనాదులు దిగ్గజములు; నేను మశకమాత్రుఁడను," అని నంది తిమ్మకవి వినయమునఁ బలికెను.

"తిమ్మకవి కుంజరా, ఆంధ్ర భోజులమని మమ్ము, దిగ్గజములని పెద్దనాదులను మీ రుగ్గడించిన మాటలు విని మాకొక క్రొత్త యూహ పుట్టినది. భోజరాజుగారియాస్థానమం దున్నట్లే మాయాస్థానమం దష్టదిగ్గజముల నెలకొల్ప నిశ్చయించితిమి. అందు మీ రొక్కరు కావలయును" అని రాయలువారు కోరిరి.

నంది తిమ్మన చేతులు కట్టుకొని, "ప్రభూత్తమా, మహాప్రసాదము. నేను ధన్యుఁడను. నాతాతగారు నంది మల్లయకవియు నా మేనమామగారు మలయమారుతకవియు దేవరవారి తండ్రిగారైన శ్రీ నరసింహ దేవరాయలవారికి వరాహపురాణము కృతియిచ్చినవా రగుటఁ బట్టి, తుళువవంశాశ్రయము మాకు నేఁటిది కాదు. ఇప్పటి నా ప్రభువు సమ్మతించినచో—"

"కవీంద్రా, అట్లే కానిండు. మామామగారివలన మిమ్మరణపుఁ గవిగాఁ బరిగ్రహించెదము," అని రాయలు వారు చిఱునవ్వుతోఁ బలికిరి.

ఈవిధముగా నంది తిమ్మకవి శ్రీకృష్ణ దేవ రాయల యాస్థానమందలి యష్టదిగ్గజములలో నొకఁడైనాడు.

౨

వెనుకటి వృత్తాంత మెప్పటిదో, యెచ్చటిదో, తెలిసికొనవలయునన్న కుతూహలము చదువరులకుఁ గలుగుట సహజము; గనుకఁ దెలుపుట యవసరము.



శ్రీకృష్ణదేవరాయలు

విజయనగరసామ్రాజ్య ధౌరేయుఁడైన శ్రీకృష్ణ రాయలు దక్షిణదిగ్విజయయాత్ర పూర్తియైన వెంటనే

పూర్వదిగ్విజయయాత్రకుఁ గ్రీ. శ. 1513 సంవత్సరమున బయలువెడలి, తొలుదొల్త నెల్లూరుమండలమందలి యుదయగిరి దుర్గము ముట్టడించెను. ఆ ముట్టడి సాఁగి సాఁగి సాగిన కాలమున, రాయలకు నెల్లూరు మండల రాజధానియైన కనకగిరిఁ గూర్చిన ముచ్చటలు విన వచ్చినవి. మండలాధీశ్వరుని కొమార్త అన్నపూర్ణాంబ రతిని మించిన సౌందర్యవతి యని విని, యా కన్నియ రూపపటమును దెప్పించుకొని కనికరము మాలి విరివిలుతుఁడు వేయు శరాళివలన విరాళిగొని, తన యవస్థ పితృతుల్యుఁడై తిమ్మరసు మంత్రికి రాజు రహస్యముగాఁ దెలిపెను. అన్నపూర్ణాంబ తండ్రి వీరరుద్రగజపతి ఓరుగంటి ప్రతాపరుద్రుని సంతతిలోఁ గడపటివాఁ డగుటఁబట్టి యట్టి సుక్షత్రియునితోడి సంబంధము కృష్ణరాయని వంశమునకుఁ బ్రఖ్యాతి తెచ్చుననియు, నెల్లూరుమండలాధిపతితోడి సంధిపూర్వదిగ్విజయయాత్రాకార్యమునుసులభము కావించు ననియు, ధీమంతుఁడైన తిమ్మరసుమంత్రి యూహించి, యందులకు రాయబారము నడిపెను. వీరరుద్రగజపతి కృష్ణరాయనితోడి వియ్యమునకుఁ గాని నెయ్యమునకుఁ గాని యియ్యకొనక కయ్యమునకే కాలు ద్రవ్వినందున రాయలు కినిసి, యుదయగిరి ముట్టడి రాయసము కొండమరుసయ్య యను దండనాథుని కప్పగించి, తాను దిమ్మరసుతోఁ గలిసి కనకగిరి మీఁదికిఁ బోయిఁడెను.

సంఖ్యయం దేమి, సాధనసంపత్తియం దేమి, సమరనైపుణ్యమం దేమి, వీరరుద్రుని సేనకంటె రాయల సేన ముమ్మడి పలుమడి. కటకదేశాధీశ్వరుఁ డైన ప్రతాపరుద్రగజపతి తనకుఁ దోడువచ్చు నన్న యాశ వీరరుద్రునికి మొదటిలోనుండి, యా హేతువుననే యాతఁడు రాయలను ధిక్కరించుటకు సాహసించెను. తన్ను మాలిన ధర్మము లేదన్న పద్ధతిలోనివాఁడైన ప్రతాపరుద్రుఁడు తన రాజ్యమును విడువనొల్లక, కృష్ణదాఁటి యీవలి కడుగుపెట్టని కారణమున వీరరుద్రుఁడు నిరాధారుఁడై చేయునది లేక రాయలకు లోఁబడి పిల్ల నిచ్చుట కొడంబడినాఁడు.

అప్పటికే మాఘమాసము నిండినది. మౌహూర్తికులు ఫాల్గుణబహుళసప్తమికి వివాహము నిర్ణయించిరి. రాణివాసమున కొజ్జ యనఁ దగు పెద్ద కొజ్జా యంతఃపురస్త్రీజనమును విద్యానగరమునుండి తోడి తెచ్చుటకుఁ దగిన యేర్పాటులు జరిగినవి. కనకగిరి వెలుపటి బయలున విడిసిన రాయల శిబిరము విశాలములైన వీథులతో, వివిధవస్తువులను విలిచెడి విపణిగృహములతో, వేడుకలకు నిలయములైన వినోదమందిరములతో, వెల్ల జెండాల తోడి గుడారములతోఁ గనకగిరికంటెఁ గడుఁబెద్ద నగరమై, 'యవనరాత్రుల వినోదము'లను కథలయందలి యద్భుత దీపస్తంభపు మహిమయో, మాయయో, మహేంద్రజాలమో యనిపించెను. శుభలేఖ లందిన యంతలో రాజబంధువులును, సామంతరాజులును రాఁ జొచ్చిరి: ఆర్వీటివారు, ఔకువారు, నంద్యాలవారు, వెలుగోటివారు, పెమ్మసానివారు, బూదహాళివారు, ఇత్యాదులు చుట్టపక్కములు వచ్చిన కొలఁది విడుదులకిచ్చిన వెల్లగుడారములు హెచ్చి, యచ్చోటెల్ల విచ్చిన వెలిదామరలతోడి విరికొలను మచ్చున లచ్చికాటపట్టోయన ముచ్చట గొలుపఁ జొచ్చినది. ఫాల్గుణ బహుళసప్తమి యుదయమున శ్రీకృష్ణదేవరాయలు పెండ్లికొడుకై మహావిభవముతోఁ బట్టపుటేనుఁగుపై నెక్కి యూరేగి, పెండ్లిసింగారముల మూలముననే కాక నిత్యకల్యాణమును బచ్చతోరణము నైన కనకగిరికిఁ దరలి వెడలెను. రాయల వివాహము కథాంశము కాదు గనుక, దాని ప్రత్యేక వర్ణన మనవసరము. అంతటి మహారాజు పెండ్లి యెంతటిమహావైభవముతో జరుగవలయునో యట్లే జరిగెను. పెండ్లి యేనాళ్లయిన వెంటనే శోభనము కావలసినది. ఆటంకసూచకముగా దాసీజనమందు గుసగుసలు పుట్టినవి. ఉగాది నాఁటి ఉదయమున స్నానము; నాఁటిరాత్రి గర్భాధానము. రాయలు తన శిబిరమునకుఁ దిరిగి వచ్చి, యుగాదికొఱకు గడియ యుగముగాఁ గడుపుచుండెను. రాజులపై దాడి

వెడలిన రాయలపై రతిరాజు దాడి వెడలి, మామిడి చిగురువింట వేఁపపూవుటమ్ములు సంధించినాఁడు.

ఉగాది, మెట్టకేలకు, వచ్చినది. యుగాదియనియే రాయలు దానిని భావించెను: తన సౌఖ్యయుగమున కది యాది!

ఉగాది యుదయమున శ్రీకృష్ణదేవరాయఁడు రెండవ యాఖండలుఁడో యనఁదగిన యఖండవైభవమున నిండోలగ ముండెను. ఉదయమునుండీ యుగాది కానుకుల కెడ తెఱపి లేదు: తన వారు పెట్టినవి; కనకగిరివారు తెచ్చినవి; లోఁబడిన రాజులు పంపినవి; మణులు చెక్కిన నగలు; మంచి ముత్యాలపేరులు; బంగారు టంకములు; పట్టుపీతాంబరములు; అందమైన కవచములు; అపురూపమైన యాయుధములు; అరబ్బీ గుఱ్ఱములు; అంబారీ యేనుఁగులు......

అన్నింటికంటెఁ గడపటవచ్చినవి, యన్నపూర్ణాదేవి పంపినవి. ఆ యుగాది కానుకలతోనే మన కథ యారంభము.

3

అన్నపూర్ణాదేవిపంపిన యుగాది కానుకలు,మూడు బంగారు ప్రతిమలు. అవి స్త్రీవిగ్రహములు. ఒండొంటికి రెండంగుళముల యెడమునుండి, యవి యొకదానికొకటి సన్నని బంగారుకడ్డీలమూలమునఁ గలిసియున్నవి.నడిమిది సుమారుమూడంగుళముల యెక్కువయెత్తు గలిగి, మొత్తముమీఁద నొకయడుగు పొడుగుండును. ఆ పొడవు కిరీటము మూలమునఁ గావచ్చును. కిరీటములు లేకుండుటఁ బట్టియేకాక మోడ్పుచేతులఁ బట్టియుఁ, బార్శ్వముల నున్నవి పరిచారికావిగ్రహములని, మధ్యది దేవీ విగ్రహమని స్పష్టము. అంతేకాదు: మధ్యవిగ్రహమునకు వెనుక తట్టున "అన్నపూర్ణ" యన్న పేరు చక్కని విడి యక్షరములతోఁ జెక్కియున్నది. ఆపేరు విశ్వేశ్వరుని దేవిదో, కృష్ణరాయని దేవిదో, తెలియుటకుఁ దగినసూచన లేవియు లేవు. భర్తకు భార్య తనవిగ్రహమునే కానుకపంపునన్న న్యాయమున సభాజను లది రాయలవారి దేవేరిదే యని నిశ్చయించి, యా యుగాదికానుక యౌచిత్యమును వేనోళ్ల స్తోత్రము చేసిరి.

పిదప, శిల్పిచాతుర్యము కొంతపొగడ్త పడసినది. ప్రక్కబొమ్మలమీఁదఁ బనివాఁడు నేర్పంతగాఁ జూపలేదు: ఏదో విధముగా వెట్టితీర్చుకొన్నట్లు ముగించి, యూఁడుపోఁతమాత్రము తెచ్చివిడిచినాఁడు. పనివానితనమంతయు మధ్యవిగ్రహముదే. ఒక కుందనపుఁబనియేమి, చెక్కడపుఁబనియేమి, జిలుగుపనియేమి, నగిషీపనియేమి, నాజూకుపనియేమి, తనకుఁగల నైపుణ్యమంతయు వినియోగించి శిల్పి తన విశ్వకర్మనామము సార్థకము చేసికొనినాఁడు. మొగము, కన్నులు, ముక్కు, చెక్కులు, చెవులు, చేతులు, కాళ్లు, శరీరము మొదలైన సకలావయవములను శ్రద్ధతో, సావధానతతోఁ, జాతుర్యముతో, సొంపుగా, సొగసుగా, సున్నితముగాఁ, జెక్కి, సాపుచేసి, మెఱుఁగుపెట్టి, యనియొకదివ్యమంగళ విగ్రహముగాఁ దేలువఱకు నతఁడు తృప్తి పొందలే దనుట నిశ్చయము. కుడికాలు కొంచెము వంచి ముందుకుంచి, యెడమచేయి నడుమునమోపి, కుడిచేయి కుడితొడ ప్రక్కకు జాఱఁ జాఁపి, సింగారముగుల్కు శీవితోఁ, జిఱునవ్వు మొగముతో, సిగ్గునవ్రాలు కన్నులతో, జీవకళ లుట్టిపడ నిలుచున్న యాబంగారుబొమ్మనుజూచి తలయూఁచి మెచ్చనివాఁడు మచ్చునకైనను సభలో లేఁడయ్యెను. ఇఁక రాయని యవస్థ వలరాయనికే యెఱుక!

కల్వలరాయని యందలి మఱకవలె మధ్యవిగ్రహమందొక్కలోపము కలిగినది. దాని వెనుకనుగల "అన్నపూర్ణ"యన్న యక్షరము లొకదాని తరువాత నొకటిగా నుండక, యొకదానిక్రింద నొకటి యుండుటేగాక యెగుడు దిగుడుగాను దేలినది. ఎట్లనఁగా,'అన్నపూర్ణ'యని మీఁద నుండి క్రిందికుండుటకు మాఱు 'ర్ణపూన్నఅ' యని క్రింద నుండి మీఁదికుండెను. తొందరచేత శిల్పివిగ్రహమును దలక్రిందులుగాఁ బట్టుకొని యక్షరములు చెక్కియుండు నని సభాసదులు సమాధానము చెప్పిరి.



"కవీంద్రా, ఇది మీరు రచించినదా"

ఉగాది కానుకలతో వచ్చిన పద్యము తిమ్మరసు మంత్రి దీక్షతోఁ దిలకించి తిలకించి తిమ్మకవితో, "కవీంద్రా, ఇది మీరు రచించినదా" అని యడిగెను.

"మంత్రిసత్తమా, అది నా కవిత్వము కాదు; అన్నపూర్ణాదేవిది."

"ఏమీ? కూర్పు కడు నేర్పుగా నున్నదే."

"సంగీతసాహిత్యములందుఁ జక్కని పాండితిగలది నా శిష్యురాలు."

"ఓహో! అట్లు చెప్పఁడు. మీరు కవితాగురువులైనప్పుడు మార్దవమున కేమికొఱంత? కవీంద్రా, దేవిగారికిఁ దగిన యుగాది కానుకలు ప్రభువవారాలోచించి పంపుదురని చెప్పఁడు," అని తిమ్మరసుమంత్రి రాయల వంకఁ దిరిగి, "ప్రొద్దెక్కుచున్నది. ఏలినవారు కొలువు చాలింతురా?" అనెను.

"అప్పాజీ, అట్లే కానిండు," అని కృష్ణరాయఁడు దిగ్గున లేచెను.

౪

గుడారమందలి యభ్యంతరభాగమునఁ బర్యంకము మీఁదఁ బట్టుదిండున కానుకొని కృష్ణరాయఁడు కూర్చుండి యుగాది కానుకగా వచ్చిన యన్నపూర్ణాదేవి విగ్రహము వంకఁ దదేకదృష్టితోఁ దనివితీఱక చూచుచుండెను.

ద్వారమున కాచ్ఛాదనముగా వ్రేలాడుచున్న యాకుపచ్చ ముకమలు తెరగుడ్డను త్రోసికొని తిమ్మరసు మంత్రి లోనికివచ్చి వచ్చుటతోడనే, అబ్బాయీ, నీయందనురక్తి, యందులకుఁదగిన పతిభక్తి గలయిల్లాలు నీకు లభించినది," అనెను.

చేసన్న చేఁ దిమ్మరసును బర్యంకముపై నాసీనుని జేసి యటుపిమ్మట రాయలు, "ఉగాది కానుకలు పంపుటయే యనురక్తికిఁ బతిభక్తికి సూచకములా?" అని మందహాసము చేసెను.

"అనురక్తియుఁ బతిభక్తియు మాత్రమే కాదు. యుక్తియు మనశ్శక్తియుఁ గలది నీ వెలఁది."

"అప్పాజీ, ఉగాదికానుక లిన్ని విషయములను దెలుపుచున్నవా?"

"దేవిపంపిన పద్యముతోఁ గలసి."

"పద్యమా?" అని కృష్ణరాయఁడు కనుబొమ్మ లెగనెత్తెను.

"అవును. ఆ పద్యమందలి 'యుపాయముల్ తోఁగి' యన్న భాగముఁగూర్చి నీవు నిదానముగా నాలోచించితివా?" అని పద్యముగల తాటాకు తిమ్మరసు రాయలచేతఁ బెట్టెను.

పద్యము రెండుమూడుసారులు నోటిలోఁ జదువుకొని, "అప్పాజీ, నాకేమియు విశేషము కనఁబడలేదు. భర్తనైన నాకుఁ బగతుఁ అవలని యుపాయములు తోఁగవలయునని దేవికోరుట సహజము. అనుమానము మీ కేల కలిగినదో" అని రాయలనెను.

"మొదటిలో నేనును నీవలెనే యూహించితిని గాని, దేవీవిగ్రహముమీఁది యొగుడుదిగుడు వ్రాఁత నా యనుమానమునకు హేతువైనది."

"ఆ మెగుడుదిగుడునకు సభాసదులు చెప్పిన సమాధానము మీరు వినలేదు కాఁబోలు?"

"వింటినిగాని యది నాకు నచ్చలేదు. శిల్పి విగ్రహమును దలక్రిందులుగాఁ బట్టుకొని చెక్కిన యెడల, 'శ్రీపూర్ణా' యని యక్షరములు తిరుగఁబడి యుండును గాని, ర్ణపూర్న అ యని తిన్నగానుండుట సంభవింపదు." రాయలు తటాలున విగ్రహము త్రిప్పిచూచి యచ్చెరువుతో, "అవునవును," అనెను.

"ఎగుడుదిగుడు ప్రమాదజనితము గాక ప్రయత్నపూర్వకమని తెలియఁగానే నేను మరలఁ బద్యమునుజదివి చూచితిని 'వివరంబుగా నరయుమా' యన్నమాట లప్పుడు నామనస్సు నాకర్షించినవి."

రాయలు ముఖమెత్తి యాలోచించి,? "పూర్తిగా దెలిసి కొమ్మని గదా దాని యర్థము." అనెను. "వినఁగానే స్ఫురించునట్టి యర్థముమదే. కాని, వివరముగా నరయుటకు దేవి తెలిపిన యనేకాంశములేవి? కాఁబట్టి, వివరశబ్దమునకు రంధ్రమని, యర్థముచేసి, దేవీవిగ్రహమున రంధ్రముండు నని నిర్ధారణము చేసితిని. ఉగాది కానుకలు 'హితగర్భితమైన' వనుటయు సాభిప్రాయమని నాకప్పుడు బోధపడినది. ఇప్పుడు చదివి చూడుము, పద్యము."

చదివి చూచి సాలోచనముగా రాయలు, "అప్పాజీ, ఇప్పుడుమీరుచెప్పినదెల్ల బహుయుక్తియుక్తము, కాని, రంధ్రము కనఁబడదే?" అని విగ్రహము త్రిప్పిత్రిప్పి చూచెను.

"కుమారా, రంధ్రము గూఢముగా నుండుటకే యేర్పాటు. దానిని గనఁగొనుటకే మెగుడుదిగుడు వ్రాఁత. అక్షరములు దిగువనుండి మెగువకుండుట, నీల దిగువనుండి మెగువకు నొక్కమనుటకు సూచన."

"నీలమా?" అని విస్మయమున.

"అవును. దేవీవిగ్రహమున కడుగున విధిగా నీల యుండును," అని తిమ్మరసు నిబ్బరముగాఁ జెప్పెను.

తొందరతో రాయలు చూడఁగా, నీల యున్న సూచన యేమియులేదు. ఐనను మానక యన్నిచోట్లను వ్రేలుపెట్టి గట్టిగా నొక్కుచుఁ బోవఁగా నెక్కడనో టక్కుమన్నట్లయి తటుక్కున విగ్రహము శిరస్సుమీఁది కిరీటమొక ప్రక్కకొఱగి, శిరస్సునుండి లోపటికి రంధ్ర మేర్పడినది. ఉల్లిపొర వంటి సన్నని కాగిత మొకటి యా రంధ్రములోఁ జుట్టచుట్టుకొని యుండెను. తీసి విప్పఁగాఁ దానిమీఁద ముక్తాఫలములను బోలిన చక్కని గుండ్రమైన చిన్న యక్షరములతోడి వ్రాఁత కనఁబడినది. వడివడి వంగి, రాజమంత్రు లొక్కసారి దానిని జదువఁ దొడంగిరి.

శ్రీ

స్వర్ణపుష్పపూజయన్న నాదే అది చేసియేకదా
భవదమలపత్నినైతి నన్నోలినట్టి వెలఁది పుడమి నున్నె
నా పాటి పూఁటదలరమ కాదుకాదా యుమవివేచనము
వరున నొకవేళ రాజమాళి రోషమయా నా యానకి
పేరూనితి భవానిమగనిఁ బ్రేమన్నాసి గడె నిలువఁబోను
నన్ను బలెనే నా ప్రతిమకన్గొనుదు రన్దుర్భ్రిమముపొడమి
యుగాదికాన్కగ నేనిపు డంపిన దానభక్తిని శోధించి
త్రిప్పుదురా యెన్నఁటికేని నేను మీవిధేయ
నగుదు మరుఁడుతావకారి నేనచలజాత అన్నపూర్ణ.

కాగితము మీఁది యక్షరపంక్తి యిది. మొగమెత్తి రాయలుసంశయగ్రస్తునివలెఁ దిమ్మరసు వంకఁజూచెను.

"నాయనా, ఏమి నీ సందేహము?" అని తిమ్మరసు ప్రశ్నించెను.

"అప్పాజీ, విగ్రహమున వివరము కలదని, విగ్రహమున కడుగున నీలయుండునని, నీల దిగువనుండి మెగువకు నొక్కవలయునని, గ్రహింపఁగలిగిన మీ యప్రతిమాన ప్రతిభ ప్రశంసాతీతము. అందు మూలమున దేవి నాకు వ్రాసిన ప్రచ్ఛన్నలేఖ ప్రత్యక్షమైనది; ఆమెకు నాపైని గల భక్తి ప్రకటితమైనది. కాని, యామె సూచించిన

యపాయముల మాట యిందేమియు లేదు గదా యని యోజించుచుంటిని."

"పయికిఁ గనఁబడుచుండలే దనుట స్పష్టము."

"పయి కగపడనిది కొంతయున్నదా, దీనిల్లో?" అని రాయలు పృచ్ఛచేసెను.

"అబ్బాయీ, లేఖ పద్యరూపమా, గద్యరూపమా?" గద్యరూప మన్నది రాయల జవాబు.

"గద్యమైన యెడల, ధారాళమైన నడక యేల లేదు? 'ననోచ్బలిన', 'ప్రేమన్బాసి', 'అన్దుర్భిమము', 'ఉన్నే', 'అఁటది', మొదలైనవి గద్యరచనలో ననవసరములు. కాఁబట్టి యీ లేఖలో గర్భితమైన గుప్తసందేశమేదో యున్నదనుట నిశ్చయము. లేకున్న లేఖ యింతనిగూఢముగాఁ బంపనేల? తన వారి యెఱుక లేకుండ లేఖను బంపిన భయమే, లేఖ యొరులచేతఁ బడినను సందేశమును బై కగపడకుండఁ జేయుటకు హేతువు."

"నిగూఢమై యున్న లేఖ యొరులచేత నెట్లు పడును?"

"విగ్రహము నలుగురి చేతులలోఁ దిరుగు నప్పటి రాపిడిని సీల తనంత యూడవచ్చును." తల పంకించుచు రాయలు: "మఱి లేఖలో గర్భితమైన సందేశమును వెలువరించుటకు మార్గము—"

"లేకపోలేదు. 'అన్నపూర్ణ' యన్న యక్షరముల మొగుడుదిగుడు, సీల మొగనొక్కుటకు మాత్రమే సూచన యనుకొంటిని. ఈ లేఖ దిగువనుండి మొగువకుఁ జదువవలయు ననుటకుఁ గూడ నది యొకసూచన. లేఖయందలి 'త్రిప్పుదురా' యనుమాట మఱొక సూచన."


రాయలు లేఖవంకఁ జూచుచు, "ర్ణపూన్నఅతజాలచననేరికావ—"అని దిగువనుండి మొగువకుఁ జదువ నారంభించెను.

తిమ్మరసు నవ్వుచు: "నీవు చదువుచున్నది యష్టభాషలలోనిది కాదుసరిగదా, చీనబర్బర యవనాదులైన యన్యదేశభాషలందలిదియుఁ గాదు. లేఖలో నట్టి 'త్రిప్పుదురా' యని కాక, 'శోధించిత్రిప్పుదురా' యనియున్నది. అట్టిశోధన మొదటఁ గావలయును. బేసియక్షరములో,"

అనునరికి రాయలు, "ర్ణ—న్న—తి—ల—న—రి—వ—" అని కూడఁబలుక సాగెను.

చిఱునవ్వుతోఁ దిమ్మరసు: "బేసివి కావు. సరి—"

అర్ధోక్తిలోనే, "పూ—అ—జా—చ—నే—కా—తా—" అని మరల రాయలు.



"సరియక్షరములును గావు. మఱి యేమై యుండును?"

అడ్డువచ్చి తిమ్మరసు, "సరియక్షరములును గావు. మఱి యేమై యుండును? ఏదో సూచన దేపిపెట్టియే యున్నది. అదిపోల్చుకొన లేకుంటిమి," అని నోటిలో గొణఁగుకొనుచు కీర్ఘాలోచనలో మునిఁగి మిన్ను చూచుచు నిశ్శబ్దముగాఁ గూరుచుండెను.

ఆ పూలోచనకు భంగము కలుగునేమో యన్న భయమున రాయలు కరచరణాదులు కదల్చుట లేదు; గాలి గట్టిగాఁ బీల్చుట లేదు.

నిద్రలో నుండి త్రుళ్లిపడినవానివలెఁ దిమ్మరసు మంత్రి దడాలున లేచి, "పరిచారికావిగ్రహములు, పరిచారికావిగ్రహములు!" అని కేక వేసెను.

ఉగాది కానుకలను జేతితోఁ బట్టుకొని రాయలు, "వీనియందును వివరము లున్నవా? అని పార్శ్వవిగ్రహముల యధోభాగముల వ్రేలితో వడివడి నొక్క సాగెను.

"అది కాదు. ఆహా! రాజ్యాంగసంబధము లైన గూఢ లేఖల నవలీలఁ జదువఁ గలనన్న ప్రసిద్ధి నాకున్నది. అట్టి నాకుఁ గన్నులయెదుటి యీకిటుకు పోల్చుకొనుట కెంతసేపు పట్టినది! భర్తకుఁ దన విగ్రహ, మొక్కటి మాత్రమే పంపవలసినది, పరిచారికావిగ్రహములును గలిపి పంపినందున, దేవి కొంత యతిశయము కలదేమో యని సందేహించితిని. ఆవిగ్రహము లామెకలుపుట యుద్దేశపూర్వకమన్న సంశయమును నాకుఁ గలుగలేదు. ఇదియే కన్నులున్న గ్రుడ్డితనము, "అని తిమ్మరసు తన బుద్ధిమాంద్యమును నిందించుకొన సాగెను.

"అప్పాజీ, ఈచిక్కుసమస్య యంతయు నింత చక్కగా విడఁదీయుశక్తి మీకొక్కరికేఁ దక్క వేఱెవ్వరి కున్నది? దేవి యింత గూఢసందేశము పంపుట మీబుద్ధి సూక్ష్మత నమ్మి కాని నా తెలివితేటలు నమ్మి కాదు. ఏల యూరక మిమ్ముల మీరు నిందించుకొనెదరు? మఱి యీ పరిచారికావిగ్రహముల యందలి గుట్టేమో దయచేసి తెలుపుడు."

"నాయనా, స్పష్టముగాఁ గనఁబడుచున్నది. ప్రక్క బొమ్మలు పనికత్తెల వగుటచేత ముఖ్యములు కావు; నడిమి దేవీవిగ్రహమే ముఖ్యము. కాఁబట్టి లేఖయందు మూఁడేసి యక్షరముల చొప్పునఁ దీసి, యటునిటు నున్నవి విడిచి, నడిమి యక్షరములు మాత్రమే తీసికొనుచుఁ బోవలయును. ఇది దీనిలోని కిటుకు. తప్పదు, చూడుము, "అనితిమ్మరసు తెలిపెను.

ఆత్రముతో రాయలు లేఖను జూచుచు: "ర్ణ— పూ—న్న—అ—"

తిమ్మరసు: "మఱేమి? త్రిప్పిన, 'అన్నపూర్ణ' అది దేవి సంతకము".

మరల రాయలు: "సి—దా—ద—ప—"

తిమ్మరసు సంతోషముతో, "పదదాసి. ఓహో! ఏమి సౌలభ్యము! నాయనా, నీవు మహాదృష్టవంతుఁడ వోయి! ఇఁకేఁ గాగితము మీఁద నంతయు వరుసగా వ్రాసి, త్రిప్పి చదువ వచ్చును," అనెను.

రాయలట్లే చేయఁగాఁ దేలిన ఫలితము: "ప్రాత చరితా మనవి నేఁటి రాత్రి శోభనపు గది మీము న్దనుమ నాబదులుగ మగవానికి నాదొూజ వేసము వేయున రఁట, పానుపు వెలితి; పదదాసి అన్నపూర్ణ."

ఆ గూఢసందేశము బయలు పడిన తరువాత రెండు మూఁడు నిముసముల వఱకును మాటలు లేక యొండొరుల మొగముఁ జూచుకొనుచు రాజమంత్రులు కూరుచుండిరి. అటు పిమ్మట రాయలు తటాలునఁ దిమ్మరుసు కాళ్ల మీఁదఁ బడి, "అప్పాజీ, బృహస్పతిని మించిన మీ బుద్ధిబలము వేయి కన్నులతో నన్నుఁ జిన్నతనము నుండియుఁ గాచుచున్నది. మీ శేముషీ మూలమునఁ గాకున్న నేఁటి రాత్రి,—" అని గొంతెము వడఁకు గొంతుక పెట్టెను.

అతనిని లేవనెత్తి తిమ్మరసు, "నాయనా, ఈనాఁడు నిన్నుఁ గాచినది నా శేముషి కాదు. అన్నపూర్ణాదేవి పతిభక్తియు బుద్ధిశక్తియు నీకు నేఁడు ప్రాణరక్షణకారణములైనవి. ఆమె పంపిన గూఢసందేశము లేకుండ, నేను నిన్నుఁ గాపాడుకొనఁ గలిగియుండునో, లేదో?" అనెను.

"అప్పాజీ, నాకుఁ గూఁతు నిచ్చి యెట్లు నన్నుఁ జంపించుటకుఁ బూనుకొనెనో వీరరుద్రగజపతి."

"నాయనా, ఉత్తమక్షత్రియుఁడను దానన్న యభిమాన మతనికి మిక్కుటము. అందు మూలముననే మొదటిలో నీతోడి సంబంధమున కంగీకరింపమి. నిర్బంధమున సమ్మతించినను, లోపటి పట్టుదల యతని యుచితానుచిత జ్ఞానమును నాశనము చేసియుండును."

"అందు మూలమునఁ దన యేకపుత్రికకు—"

"కుమారా, కులాభిమాన మెంత పనికైనను వెను దీయనిది. అది క్షత్రియులలో మఱియు హెచ్చు."

ఆలోచన తెలుపు మొగముతో రాయలు, "అప్పాజీ, 'పానుపు వెలితి' యన్న మాటల కర్థమేమి? శయ్యావిసర్జన సూచనము శోభమునకు నన్ను రానే వద్దన్న యుద్దేశమా?" అని ప్రశ్నించెను.

"అబ్బాయీ, నీ యూహ సరి కాదు. పద్యమున 'అపాయముల్' అని బహువచనప్రయోగ మున్నది. ఆ మాటలు రెండవ యపాయమును దెలుపునవి."

"అది యెట్టిది?"

"నా యూహ యేమనఁగా: మనము కథలలో విన్నాము, నడుమఁ బూర్తిగా వెలితియుండి, వెలితి తెలియకుండ మీఁద దుప్పటి కప్పియున్న పానుపుల పైని బరున్న వెంటనే యమాంతముగా దిగువ లోఁతు నూతులలోను గోతులలోను బడి మనుష్యులు మరణించిన సంగతి. అట్టి పన్నాగ మేదో పన్నుదురన్న మాట. కాఁబట్టి నీవు నేటిరాత్రి వెంటనే పానుపెక్కక, దులిపినట్లు దానిని చేతితో గట్టిగాఁ దట్ట వలయును."

"అట్లయిన రాత్రి శోభనమునకు వెళ్లవలసిన దనియే మీ యుద్దేశమా? అపాయములు—"

"అపాయములేవో దేవి కృప వలన ముందుగాఁ దెలిసినవి. తెలిసిన యపాయము లుపాయమునఁ దప్పించుకొన వచ్చును. అందు వలన శత్రువుల కెక్కువ గుండె బెదురు కలుగును గాని, జంకి యపాయముల నడిమికిఁ బోకుండుట వలనఁ గాదు."

ఆలోచించుచు నంగీకారసూచకముగా రాయలు తల యూఁచెను.

"పుత్రా, ఇటలీ దేశమందలి మిలాను నగరమునఁ దయారైనదని చెప్పి, బుడతగీచుల రాయబారి న్యూనీజు పూర్వము నీకొక కవచము కానుక పెట్టెను. అది యిప్పుడు నీయొద్ద నున్నదా?"

"ఉన్నది."

"ఉక్కుదే నైనను, అది పట్టు బట్టంత మెత్తనిదై యొంటి నంటిపెట్టుకొనియుండి, కత్తి దెబ్బను బాఁకు పోటును దగుల నీయనిదని దానిని న్యూనీజు వర్ణించినాఁడు. ఆ కవచము నేటి రాత్రి నీవు లోపలఁ దొడుగుకొన వలయును."

"చిత్తము."

"తక్కిన యేర్పాటులన్నియు నేను జూచుకొనెదను. తాను బంపిన సందేశము మనము పోల్చుకొంటిమో లేదో యని దేవి యారాటపడుచుండును. ఆమె పంపిన మాదిరిదే యామెకుఁ బంపుటకై యొక లేఖ వ్రాయుము. తగిన యుగాది కానుకలు నేను జతపెట్టెదను," అని చెప్పి, తిమ్మరసుమంత్రి తెరతెఱచుకొని బయటికి వెడలెను.

గీర్వాణభాషయందు రసమంజరీ ముఖ్య మధుర కావ్యరచనకంటె, ఆంధ్రభాషయందు దేవి వ్రాసిన లేఖ కూర్చుటే యెక్కువ కష్టమన్న సంగతి మహాకవి యైన కృష్ణరాయని కప్పుడు బోధపడినది.

౨

కథానాయిక యైన యన్నపూర్ణాదేవి రూపవర్ణన మిప్పటి వఱకును లేకుండుట గొప్ప లోపమని చదువరులు భావింతురు. అసమర్థత దానికి హేతువని వా రూహింపవచ్చును. ఆ యూహ కేవలమును దప్పు కాదు.

అన్నపూర్ణాంబిక మేను పసిమి కమ్మ పసిఁడిది; మోవి కావి జాతి కెంపుది; మోము గోము పున్నమ జాబిల్లిది; కన్నుల బెళుకు గండు బేడిసలది; నగవు తేట పండు వెన్నలది. అన్నియు నెన్నికయైన లక్షణములే; కాని, యా లక్షణములలో దేనిమీఁదను జూపఱు వీక్షణములు ప్రసరింపక, కొదమతుమ్మెదకదుపులను గదుముచున్న యా ముదిత నల్లని తలవెండ్రుకలమీఁదనే ముందుగాఁ బడును. అత్యంతసుందరములైన యాసోగపెన్నెఱుల సొబగు మనస్సున నుంచుకొనియే కాఁబోలుఁ, గృష్ణరాయఁడు విష్ణు

చిత్తీయమందు నాయికావర్ణనము పట్టున "హేమాంగాభవి" భేత్యాదిపద్యమును రచించెను! అయొక్క పద్యమే కాదు. అన్నపూర్ణాంబ సౌందర్యము నాదర్శముగా నుంచుకొని కవిరాజైన యారాజకవి యాముక్తమాల్యద యనఁబడు చూడికుడుతనాంచారు రూపవర్ణనము నడిపె ననుటకు సందేహములేదు. అది చదువుకొనఁ బాఠకులకు హెచ్చరిక! ఏల యంటిరా, భర్తకంటె బాగుగా భార్యా రూపవర్ణనము చేయు వా రుండఁబోరుగదా?



అన్నపూర్ణాదేవి.

భర్తచేసినదైనను, బరులు చేసినదైనను, వట్టివర్ణనముఁబట్టి రూపము కన్నులకుఁ గట్టుట వట్టిది. చరిత్రకారులు: "కృష్ణరాయలు మిక్కిలి పొట్టివాఁడు గాఁడు, పొడుగువాఁడును గాఁడు. సామాన్యమైన యెత్తుగలవాఁడై చక్కని ముఖవర్చస్సును, సుందరాకారమును, దృఢశరీరమును గలిగియుండెను. రాయలముఖముమీఁద స్ఫోటకపు మచ్చ లుండెను," అని వ్రాసినారు. ఆధారముగా రాయల రూపపటమే లేనియెడలఁ, బయిఁవ్రాఁత యారాజచంద్రుని యాకారమును మన కన్నులయెదుటికిఁ దెచ్చుట కేమంత యుపయోగకారి? అట్టి యాధారముగుటకై యన్నపూర్ణాంబ రూపపట మొక్కటియు లేకుండుట గట్టిలోపము.

రవివర్మ చిత్రపటములు సుప్రసిద్ధములు. ఆ చిత్తరువులందలి నాయికలందఱు నొక్కవిధమైన యాకారము గలవారు. భేదములు వయస్సులనుబట్టి, వ్యవస్థలను బట్టి, వలువలను బట్టి వచ్చినవి. ఇంచుక పొడుగుపాటిశరీరములు కొంచెము కోలవాటు ముఖములు, వంగిన కనుబొమ్మలు నిడుదఱెప్పలతోడి వెడఁదకన్నులు, రవంతసూదిగానున్న ముక్కులు, నిండైన క్రిందిపెదవులు, ఉగ్గులు దేఱి నిగ్గులు వాఱిన చెన్నెఱులు: ఇవి యా యాకారమునకు లక్షణములు. స్త్రీసౌందర్యము పరిపూర్ణత్వమున నట్లుండు నని యారాజ చిత్రకారుఁ డూహించి యుండనోపును. అతని మేనక మేని సొంపు, మోహిని ముఖకళ, రాధరామణీయకత, కలిసి యన్నపూర్ణాంబ రూపము తేలును. ఆసొబగు లన్నింటికంటె నామె చక్కఁదనమునందు హెచ్చుగాఁ గానవచ్చునది, స్త్రీల చెలువమునకుఁ జెలువమును దెచ్చు చిఱు సిగ్గు. సిగ్గుకతన శిర స్సించుక వంచుకొని యెప్పుడు నాఁడు యుండుటయే, చూపఱుదృష్టు లామె శిరోజముల సౌందర్యముపై ముందుగాఁ బడుటకుఁ గారణము కావచ్చును.

## ౨

కనకగిరి రాచనగరియందలి యొక గదిలో వీరరుద్రగజపతి, యతని భార్య మాదమ్మాదేవి, యెత్తయిన గద్దియలమీఁదఁ గూర్చుండిరి. గజపతి మొగమున గంటు పెట్టినట్లు బొమముడి యున్నది.

తల్లికిఁ గొంత చేరువగా మన కథానాయిక యన్నపూర్ణాంబ తలవంచుకొని నిలువఁబడి, "నాన్నగారూ, నన్నుఁ బిలిపించిన కారణమేమి?" అని కోకిల స్వరమున నడిగినది.

"అమ్మాయీ, ఉగాదికానుకలు పంపితివఁట నీవు కృష్ణరాయనికి! ఏల పంపితివి?" మొగమెత్తకయే యన్న

పూర్ణాంబ కొంత జంకుతో, "మన యింటివాడుక యది యని వింటిని. అమ్మ యుదయమున మీకుఁ బంపిన యుగాది కానుకలుచూచి, చెలికత్తెల హెచ్చరికమీఁద నే నట్లు చేసితిని. అపరాధమైనయెడల, క్షమింప వేఁడెదను" అని సవినయమున నుడివెను.

"మీ యమ్మ నాకుఁ బంపినదనఁగా, భార్యభర్తకు బంపుట జరిగినది. అదిగదా మనయింటి యాచారము?"

[హంసపాదము పెట్టి వెనుకటి సంగతి యొకటి యిక్కడఁ జెప్పవలసియున్నది. నిర్బంధము మీఁద వీర రుద్రగజపతి తన కొమార్తెయైన యన్నపూర్ణాంబను కృష్ణదేవరాయలకు వివాహము చేసెనని రాయలు, తిమ్మరసుమంత్రి, తక్కినలోకులు, ననుకొనిరి కాని నిజ ముగా నట్లు జరుగలేదు. వీరరుద్రునికి విమలాంగి యను వేశ్యయొకతె యుంపుడుకత్తె. దానికొక కొడుకు: పేరు బాలచంద్రమౌళి; ఈడు నూఁగుమీసమును రాని పదు నాఱవయేఁడు. అన్నపూర్ణాంబ పుట్టిననాఁడే వాఁడును బుట్టినాఁడు. వారిరువురును గవలపిల్లలలాగున రూపభేద మేమియును లేనివారు. ఆఁడువేసమున బాలచంద్రమౌళి యచ్చముగా నన్నపూర్ణాంబ. అట్టివేషమున బాలచంద్ర మౌళిని రాయలకు ముడిపెట్టిరి. ఈగుట్టు వీరరుద్రునకు, మాదమ్మాదేవికి,వీరరుద్రుని పెద్దమంత్రికి, మాదమ్మాదేవి యాంతరంగికపరిచారికకుఁ, దక్క దదితరులకుఁ దెలి యదు. తుదకుఁ జెలికత్తెలును బనికత్తెలును గూఁడఁ దమ యన్నపూర్ణాంబకే పెండ్లియైనదని నమ్ముచుండిరి. అందుల కనుగుణ్యముగా దొంగ మంగళసూత్ర మొకటి యన్న పూర్ణాంబయుఱుత వివాహానంతరమున వేసిరి. ఆటంక మును నేఁటిముని శోభన మూఁపుట, యటుపైని జరుప వల సిన విధానమాలోచించి, యందులకుఁ దగిన యేర్పాటులు చేయుటకు ఆయేర్పాటులు చివరవరకును గూఁతునకుఁ దెలియ నీయ రాదన్న వీరరుద్రుని యుద్దేశము నెఱవేఱ లేదు. గుట్టుదాఁచలేని యాఁడుదియు, మనసు పట్టలేని తల్లియు,నైన మాదమ్మ పెద్దమంత్రి, పన్నిన పన్నుగడను రెండుదినముల క్రిందటనే యన్నపూర్ణాంబకుఁ బూర్తిగా వెల్లడి చేసినది.]

"ఏమమ్మాయీ, మాఱుపలుకవు? మగనికే కదా యుగాది కానుకలు, మనలో?" అని వీరరుద్రుఁడు, రెట్టించెను.

వాల్యు మొగముతోనే యన్నపూర్ణాంబ, "నేనును నాభర్తగారికే పంపితిని," అని మెల్లగా ననెను.

"ఏమి?" అనిలేచి, "ఎట్లు మగఁడైనాఁడమ్మా, వాఁడు నీకు?" అని గజపతి ఫీంకరించెను.

"నాన్నగారూ, పెండ్లిపీఁటల మీఁద నాబదులుగ నెవరిని గూర్చుండఁ బెట్టిన నేమి? వివాహమంత్ర ములు నాపేరనే కదా నడిచినవి? అది గాక, రాయల వారికి నేను దేవినైతి నన్న ప్రసిద్ధి యాంధ్ర దేశమందెల్ల నల్లుకొన్నది. సాక్షాత్తిక సత్యవంతునివలె, వారే నాభర్త, నాదైవము." ఈమాటలు పలికినప్పు డన్నపూర్ణాంబ కంఠస్వరము హెచ్చింపలేదు గాని, యాఁడి పలికిన తీరును బట్టి మనోనిశ్చయము వెల్లడియైనది.

వీరరుద్రుఁడు: "పుస్తె కట్టనివాఁడు——"

"నాన్నగారూ, పుస్తెకేమి? గాంధర్వవివాహము న్నది, మన క్షత్రియులలో."

"ఇదేమే తల్లీ, యిట్టి వెఱ్ఱి నీకు? భోగకాంతకుఁ బుట్టినవాఁడా, నీవు కోరుకొన్న మగఁడు?" ఈమాటలు మాదమ్మాదేవివి.

"అమ్మా, కిట్టని వారు పుట్టించిన మాటలకెక్క డకు? నాయత్త నాగాంబాదేవిగారు గొబ్బూరి వారి బొట్టె; సుక్షత్రియకాంత."

"ఎవరికిఁ బుట్టినను వాఁడు నాతో సంబంధమునకుఁ దగనివాఁడు; వానికిని నాకును దెగని నూడు- నేఁటిరాత్రి శోభనపు గదిలో వాఁడుచచ్చుట తప్పదు," అని గజపతి కాల నేల మర్దించెను.

"హరహరా!" అని యన్నపూర్ణాంబ చెవులు మూసికొన్నది.


"మన బాలచంద్రుఁడే మరల వధూవేషమున నాటకము నడిపించును. అమ్మాయీ, నీవెఱ్ఱిమొఱ్ఱి యూహలను గట్టిపెట్టి, వివాహమందువలెనే నేఁడును నీవు బాలచంద్రుని వేషముతో మెలఁగవలయును," అని వీరరుద్రగజపతి శాసించెను.

నేలను మోఁకరించి యన్నపూర్ణాంబ, "నాన్నగారూ, నిష్ప్రయోజకములైన బాష్పములతో మిమ్ము బాధింపను. ఒక్కటి మాత్రము కటాక్షింపుఁడు. మీరను కొన్నట్లు జరిగినయెడల, నా వ్రజపు బాఁకు నాకు బానట యగుటకు మొదల యిడడు. పతితోడి సహగమనము పరమధర్మము గదా సతికి?" అని ప్రార్థించెను.

మాదమ్మాదేవి తటాలున లేచి కూఁతును కౌఁగిట గ్రుచ్చి, "మా వెఱ్ఱితల్లీ, కన్యకవైన నీకు సహగమన కర్మమేమే? నీవు దీర్ఘసుమంగళివై వర్ధిల్లుము. అమ్మా, మీనాన్నగారి మాట వినుకొమ్ము. ఉత్తమ రాజకుమారుని కిచ్చి నీకు వారు పెండ్లిచేయఁ గలరు," అని గడ్డము పట్టుకొని బుజ్జగింప సాగినది.

వెడనవ్వుతో, "మాఱుమను మున్నదఁటమ్మా; మనలో?" అని యన్నపూర్ణాంబ యడిగెను.

వెళ్లిపోవునట్లు మొగము చిట్లించి పెద్ద యడుగులతో గుమ్మము వఱకును నడిచి, "చీఁకటి పడులోపు ననే యమ్మాయి యిక్కడకు వచ్చియుండవలయును సుమీ," అని పలికి, వీరరుద్రుఁ డపరరుద్రుఁడయి బయటికి వెడలెను.



వీరరుద్రుఁ డపరరుద్రుఁడయి బయటికి వెడలెను.

౬

కనకగిరి యందలి కన్యకాంతఃపురమునకుఁ గలిసి యున్న ప్రమదావనమున నొక పొదరింట జలువరాతి తిన్నెపయి నొంటిగాఁ జెక్కిటఁ జేయి చేర్చుకొని యన్నపూర్ణాంబ కూర్చుండెను. తాను బంపిన గుప్తసందేశము భర్తకు బోధపడెనా లేదా యన్నది యామెకుఁ బట్టుకొన్న చింత.

ఇంతలో గొలగొల—కిలకిల—దులదుల మాటలాడుచు, నవ్వుచుఁ, బరువులు వాఱుచు, నామె నెచ్చెలు లచ్చోటికి వచ్చి పడిరి. లోపటి చింత కనఁబడనీయకుండ నన్నపూర్ణాంబ ప్రసన్నవదనము దాల్చినది.

"ఏమమ్మా, చెల్లీ, అన్నపూర్ణా, మఱఁదిగారిని మనస్సునఁ దలఁచుకొనుచు మమ్ము మఱచినట్లున్నావు?" అని యందఱికంటెఁ బెద్దది తిరుమలమ్మ.

"కాదమ్మా తిరుమలక్కా, మఱఁదిగారు మహా నరసులు. * * * వారికి మెప్పు కలిగించుటెట్లని చెల్లెలు దిగులుపడుచున్నది," అని వెంగళమ్మ.

"వెంగళక్కా,—కాదు, కాదు; వెఁగళప్పవే నీవు కాకున్న, శోధనమును గోమటిబేరముతోఁ బోల్చు వెఱ్ఱివారుందురా? కోమటి కున్నట్లు మఱఁదిగారికిఁ గుండబొజ్జ యున్నదనుకొంటివా యేమి?" అని నాగమ్మ.

"నాగక్కా, వెఱ్ఱివెంగళప్పయని దానిని వెక్కిరించితివిగాని, యంతకంటె నీపేరే నీకు హెచ్చు సార్థకమైనది. తెలివితక్కువ నాగమ్మవు గనుక వెంగళక్క మాటలయందలి స్వారస్యము నీవు పోల్చుకొనలేకుంటివి. మన యన్నపూర్ణక్క * * కూరుచుండును. బావగారు కొసరికొసరి యడుగుదురు" అని మోబళమ్మ.

"ఓబళక్కా, ఓ! బళా! యని నిన్ను మెచ్చవచ్చును. * * * * * * * అన్నపూర్ణక్కతో సరిసమానమైన కవితాశక్తి కలదన్న పేరుపడిన నీ కిది యొక లెక్కా? అన్నపూర్ణక్కా, వ్వారి యెక్కసక్కెపు మాటలకెక్కడకు? బావగారి కొనరు లవసరము లేకుండనే నీవు నీవి వదలుదువు," అని యందఱిలోఁ జిన్నది వరదమ్మ.

ఇ ట్లెవరికిఁదోఁచినట్లు వారు శోభనపుఁ బెండ్లి కూఁతుతో సరససల్లాపము లాడసాగిరి. లోని సంతోష మూఁపి, లేని రోషముఁ జూపి, యన్నపూర్ణాంబ కసరిన కొలఁది సఖుల విసరులు హెచ్చినవి. ముమ్మరమైన యీ వేడుకలో వారు మునిఁగియుండగా దాసి యొకతె బిరబిర వచ్చి, "రాయలవారియొద్దనుండి యుగాదికానుకలు మన యన్నపూర్ణాదేవి గారికి" అన్నది.



వెంటనే కృష్ణరాయలవారి పరిచారికలు నలుగురు నాలుగు బంగారుపళ్లెరములను నేలకు దింపి, చేతులుమోడ్చి నిలువఁబడిరి. మొదటిపళ్లెరములో జలతారు జిలుగుబుటేదారు పనిగల పసుపుపచ్చ బనారసుచీర, మంచి ముత్యములుపెట్టికుట్టిన వంగపండు రంగు మొకమలు రవిక; రెండవదానిలో నానావిధ నవరత్నఖచిత స్వర్ణాభరణములు; మూడవదానిలోఁ బసుపు, కుంకుమ, చందనము, పరిమళద్రవ్యములు, పుష్పములు; నాలవదానిలోఁబసుపు రాసిన తాటాకు.

ఆ తాటియాకును దీసి వరదమ్మ, "మేలుగ్వానియ సుందరాకారము"—అని చదవ మొదలుపెట్టినది.

తటాలుమని యన్నపూర్ణాంబ యా తాటాకు లాగుకొనెను.

నవ్వుచుఁ దిరుమలమ్మ, "అవును. వరదమ్మ చిన్నతనము చేతనే కమ్మతీసి చదివినది గాని, యట్లు చదువఁ వచ్చునా? పచ్చిపచ్చిగా నేమేమి వ్రాసిరో దానిలో మఱఁది గారు?" అన్నది,

"ఆకారవర్ణనముతో నారంభించిన వారు నఖశిఖ పర్యంతము శివమెత్తినట్లు పొగడక విడుతురా?" అన్నది వెక్కిరింపుగా వెంగళమ్మ.

.............................. యిరువదియైదేండ్ల పడుచు పెండ్లికొడుకు" అని నవ్వుచుఁ గలిపినది నాగమ్మ.

"పద్యమా, గద్యమా, బావగారు వ్రాసినది?" అని యడిగినది వరదమ్మ.

"అది మన యోబళమ్మ చెప్పవలయును. అన్నపూర్ణాంబ చెప్పఁగలదుగాని, చెప్పదు," అన్నది తిరుమలమ్మ.

ఓబళమ్మ కొంచెము యోచించి, "పద్యమే కాని, పద్యారంభము కాదు. వరదమ్మ తప్పుగా రెండవప్రక్కను జదివినది. ఆరంభము మొదటి ప్రక్క నుండును," అనెను.

తిరుమలమ్మ, "ఓబళమ్మా, చూతము మఱి నీశక్తి; మఱఁదిగారెట్లు వ్రాసియుందురో యూహించి పద్యమును బూర్తిగాఁ జెప్పుము" అని కోరినది.

"అవు నవును," "బాగున్నది," "మఱి చెప్పవే," అని వెంగళమ్మ, నాగమ్మ, వరదమ్మ, యొక్కసారిగాఁ గేకలు వేసి యోబళమ్మ చుట్టును మూగిరి.

ఓబళమ్మ యొప్పుకొని, యరగడియ నిశ్శబ్దము మాత్రము కోరినది; అట్లే మౌనము దాల్చి యామె చుట్టును దక్కిన నలుగురు కూరుచుండిరి.

అన్నపూర్ణాంబ వరదమ్మ చేతి నుండి కమ్మ లాగుకొన్నందులకుఁ గల కారణము సూక్ష్మబుద్ధి గల

చదువరులు గ్రహించియే యుందురు. గుప్తసందేశమందలి కిటుకు తెలిసినది గనుక, వరదమ్మ వెల్లడిగాఁ జదివిన భాగములోనే 'రాయలు' అన్న పద మేర్పడినట్లు వారికి స్పష్టపడి యుండును. ఇప్పుడు సందు దొరకినది కాఁబట్టి యన్నపూర్ణాంబ కమ్మ యామూలాగ్రముగాఁ జదివెను. అం దిట్లున్నది:

> మేలుత్వదీయ సుందరాకారము. బలోఁగ్యము
> సభాసదుల్ సారు స్తుత్యర్హ మనిరి నీవ్రుస్గోమ్మ్యా
> యుగాది కాన్కలివి కృష్ణదేవరాయ ప్రాణప్రియా.

నడిమి యక్షరములను వెనుకటి యట్లే తీసి త్రిప్పినప్పుడు, "ప్రియ దేవికాయువు నిత్యసౌభాగ్యము రాయలు," అని తేలును. అదిచూచి, తనసందేశమందలి కిటుకు భర్తకుఁ దెలిసినదిగదా యని యన్నపూర్ణాంబ నిబ్బరపడినది.

అరగడియయైనదని వరదమ్మ యనఁగానే పద్యము పూర్తియైనదని చెప్పి యోబళమ్మ యిట్లు చదివెను.

> "ఉ. ఆరసి చూడఁగా రతికి నన్నిట మేలు త్వదీయసుందరా
> కారము, మేలు మే! లటులుగాన.................
> గోరి,నిమేషమబ్దమనుకొంచుదినంబునుబుచ్చుచుంటి దే
> వీ, ..............., వీలుగ............మీా నిశఁ."

ఆపద్యమువిని, "మేలు!" "బళీ!" "భేషు!" "సబాసు!" అని చప్పట్లు చఱచి, సఖులెల్ల గొల్లున నవ్వసాగిరి. అన్నపూర్ణాంబ చెక్కుల గులాబిసిగ్గుచేతఁ జెంగల్వపూరంగుగామాఱినది

ఇట్లు వారు సందడిగానున్న సమయమున మాదమ్మాదేవిగారి యాంతరంగిక పరిచారిక యచ్చటికి వచ్చి, పెండ్లియందువలెనే యానాఁడును దేవిగారే యన్నపూర్ణాంబకు స్వయముగా ముస్తాబుచేయుటకు ముచ్చటపడుచున్నారనిచెప్పి, రాజపుత్రికను వెంటఁబెట్టుకొనిపోయెను.

## ౧౦

శోభనపు గది యంతయు స్త్రీమయము. పెండ్లికూఁతు వంక నున్న పేరఁటాండ్రు ముప్పదిమంది కంటె హెచ్చు; అంత కంటె హెచ్చు పెండ్లికొడుకు వంక వచ్చిన పేరఁటాండ్రు. వా రందఱును గట్టుకొన్న పట్టుచీరల పలు తెఱంగుల రంగులొకదాని వెంబడి నొకటి తోఁచి, వేళగానివేళ నింద్రధనుస్సుల సీనుచుండెను; పెట్టుకొన్న నగలయందలి వజ్రములు దీపకాంతిని దళుక్కున మెఱసి, చోటుగాని చోటఁ గ్రొమ్మెఱుంగులను గ్రుమ్మరించుచుండెను. అత్తరు, పన్నీరు, పునుఁగు, జవ్వాజి, యగరువత్తులు మొదలగు సుగంధద్రవ్యముల పరిమళము మల్లికాదిపుష్పసౌరభముతోఁ గలిసి గుబ్బుమనుచుండెను.

పీఁటల మీఁది తంతు సాంతమైనది; దంపతులు పానుపెక్కుటయే తరువాయి.

మంచము చేరిన వెంటనే రాయలు పర్యంకమధ్యభాగమును గుడిచేతితో గట్టిగాఁ దట్టెను. కుట్లు తెగినట్లు పటపటధ్వని పుట్టి, పఱపు, దుప్పటి, తలగడలు బాలీసులు, దిండులుఁ గలిసి పర్యంకమధ్యభాగమెల్ల గుబాలునఁ గూలఁబడి దిగువ నెచ్చటనో లోఁతు నీటను దబ్బునఁ బడిన చప్పుడు వినఁబడినది. మంచము నాలుగుకోళ్లు మాత్రమే మిగిలినవి.

పానుపుకూలఁబడుచున్న కాలముననే పెండ్లికొమార్త



చేయియెత్తి బాఁకుతో రాయలగుండెమీఁదఁ బొడిచెను. బాఁకుకొన వంగినదిగాని రాయలకుగాయముకలుగలేదు.

రాయల వెంట నున్న పేరఁటాండ్రు దడాలునఁ దమ మొలల నొడ్డాణముల వలె నున్న కత్తులను బైకి లాగి, రాయల చుట్టును నిలిచిరి. వారిలో నిరువురు పెండ్లికొమార్తను బట్టుకొని చేతులు వెనుకకు విఱిచికట్టిరి. బలమును బట్టి రాయల పేరఁటాండ్రు స్త్రీవేషమున నున్న కొజ్జాలనుట స్పష్టము.

శోభనపు గది యందంతటను గగ్గోలు, గలిబిలి, గందరగోళము! ఎక్కడనో యేదో బాకా యూఁదిన ధ్వని వినిపించినది. అంతఃపురమం దంతటను గలకలము, కలవరము, కంగారు! అటు పరుగెత్తువారు, ఇటు పరుగెత్తువారు, ఒకరి నొకరు త్రోసికొని పోవువారు, త్రొక్కుకొనిపోవువారు, "ఏమి యేమి?" యనువారు, "ఎక్కడెక్కడ?" యని కేకలు వేయు వారు, స్త్రీలు, కొజ్జాలు, పురుషులు, పరిచారికలు, పరిచారకులు, భటులు, ప్రభువులు, భటులు, పరిచారకులు, పరిచారికలు, పురుషులు, కొజ్జాలు, స్త్రీలును గలిసి పెద్దసమ్మర్దము తేలినది. ఎక్కడనుండియో తిమ్మరసుమంత్రి యుట్టిపడి, రాయల ప్రక్క నిలుచుండెను. ధణంధణధణంధణ మని రణభేరిధ్వని యనుక్షణమును మ్రోఁగసాగినది.

పరుగుపరుగునఁ బదునాఱేండ్ల పడుచువాఁడొకఁడు వచ్చి, "ప్రాణభిక్ష! ప్రాణభిక్ష! నా జననీ జనకులకుఁ బ్రాణభిక్ష!" అని రాయలవారి పాదముల మీఁద బడెను.

"ఎవరవు నీవు? నీజననీజనకు లెవరు?"

"ఏలినవారి దేవిని; అభాగ్యురాలను; అన్నపూర్ణను."

తటాలున వంగి, "దేవీ లెమ్ము," అని కృష్ణరాయలు చేయూఁత యిచ్చి యన్నపూర్ణాంబను లేవనెత్తి "ఏరీ, మాయత్తమామలు? 'అని యడిగెను.

"గూఢమైన సొరంగపు మార్గమునఁ గోటలో నుండి పాఱిపోవుచున్నారు. నాయందుఁ గటాక్షించి వారిని బట్టుకొనకుండ దేవరవారి సైనికుల కాజ్ఞ పెట్టఁ బ్రార్థన. వారు వింధ్యపర్వతమునకుఁ బోయి తలదాఁచు కొందురఁట!"

తిమ్మరసుమంత్రి ముఖము వంకఁ జూచి, రాజు దేవి కోరికకు సమ్మతించెను, "చంపఁదగిన యట్టిశత్రువు తన చేతఁ జిక్కినేని గీడు చేయరా," దన్న నీతి నీతియుగంధరుఁడును స్వామికార్య ధురంధరుఁడు నైన యా మంత్రిశేఖరుఁ డెఱుఁగనిదా?

పెండ్లికొమార్త వేసము జూపించి రాయలు, "ఇది యెవరు? ఆఁడుదా? మగవాఁడా? కొజ్జాయా?" అని చిఱునవ్వుతోఁ బ్రశ్నించెను.

అన్నపూర్ణాంబ, "మాతండ్రి గారి యుంపుడుకత్తె కొడుకు. పితాజ్ఞమూలముననే యీయకార్య కరణమునకుఁ బూనుకొనినాఁడు. ఇతనిని విడిపించి వింధ్యకుఁ బోవ ననుజ్ఞ యొసఁగుఁడని మనవి, "అని విన్నవించినది.

"దేవీ, అటు కాదు. నీవేషమును వేసిన హేతువున నీతని యందు మాకుఁ బ్రీతి కలిగినది. మీతండ్రిగారు రాజ్య మితని కిచ్చెదము. భయపడి పలాయితులైరి కాని, యున్న యెడల మా మామ గారికైనను హాని చేయక వారి రాజ్యమున వారిని నిల్పియుందుము, "అని రాయలు పలికెను.

ఓహో! ఏమి క్షమ! క్షమ నేలుటకుఁ దగిన వాఁడే యా రాజనారాయణుఁ డనుటకు విష్ణుచిత్తీయమున యామునాచార్యుని నోట నతఁడు పలికించిన రాజనీతి వాక్యములు సాక్ష్యములు.

* * * * *

పూర్వదిగ్విజయ యాత్ర పూర్తి కావించి విద్యానగరమునకు వెళ్లిన పిమ్మట, శ్రీకృష్ణదేవరాయఁడు అన్నపూర్ణాంబను విధ్యుక్తముగా వివాహము చేసికొనెను. అప్పటి కప్పుడే కటక దేశాధీశ్వరుఁ డైన ప్రతాపరుద్రగజపతి పుత్రికయైన తిరుమలాంబ నతఁడు పెండ్లియాడి యుండెను గనుక, అన్నపూర్ణాంబ కృష్ణరాయలకుఁ బట్టపు దేవి కాక చిన్నాదేవియైనది. పట్టమహిషియైన

రుక్మిణి మీఁది కంటె సత్యభామయందు శ్రీకృష్ణుని కెట్లో, యట్లే యన్నపూర్ణాదేవి మీఁదఁ దిరుమలదేవి మీఁది కంటె శ్రీకృష్ణదేవరాయలకు మక్కువ మెక్కువ. తల్లిదండ్రులను గాదని తనయెడల పథ్యముగా వర్తించిన భామ సత్యభామ కాదా, మన కృష్ణునకు?

*  *  *  *  *

రాయల ప్రాణరక్షణమునకుఁ గల్యాణమునకుఁ గారణములు, అన్నపూర్ణాదేవి పంపిన యుగాది కానుకలు. చదువరులారా, ఇట్టి యుగాది కానుకలు మీకును లభించునుగాక!

తే. గీ. క్రొత్త సంవత్సరంబు మీకు, భవదాప్త-
జనులకుఁ బ్రమోదకరమయి జరుగుఁ గాక!
ఇట్టి సంవత్సరంబు లనేకము లిటు
మీఁద మీకుఁ గల్గుతఁ బరమేశు కృపను.

[అనుబంధము]

1. (మొదటి పద్యము) — వివరంబు=రంధ్రము, కాఁ=కాఁగా (అయిన పిమ్మట) అరయుమా=చూడుము.

2. (అన్నపూర్ణాదేవి లేఖ)—నేను జేసికొన్నదే బంగారుపువ్వుల పూజ యనిపించుకొనును! అట్టిపూజ చేయుటచేత నేకదా మీకు భార్యనై పవిత్రురాల నైతిని? నన్నుఁబోలిన స్త్రీ లోకములో నుండునా? నాపాటి యాఁటది (ఆఁడుది), అల=ఆ, రమ(లక్ష్మి) కాదు. కాదు + ఆ + ఉమ = ఆ పార్వతి కాదు. వివేచనము వరుసన్=ఆలోచించి చూడఁగా, ఒకవేళ, రాజమౌళి యోష = శివునిభార్య(పార్వతి), ఔనా? = ఔనేమో? [ఏలయన, నావలెనే యామె రాజమౌళి (చంద్రమౌళి) యోష] ఆ సకి పేరూనికిన్=ఆపార్వతియొక్క యన్నపూర్ణ యన్నపేరు నాకును గలదు. భవాని (పార్వతి) ప్రేమమూలమున మగని విడిచి గడియయైన నుండఁబోదు. (నేను నట్లే యనుట). నన్నుఁ జూచుకొన్నట్లే నాప్రతిమ చూచుకొందురన్న దుర్భ్రమము (లేనిపోని యాశ) పుట్టి, యుగాదికానుకగా నేనిప్పుడు పంపుకొంటిని; (నా) భక్తిని బరీక్షించి, మీరు త్రిప్పుదురా? (కానుక త్రిప్పివేయ రనుట). ఎప్పటికైనను నేను మీకు విధేయురాలనే యగుదును. మరుఁడు (మన్మథుఁడు), తావకారి= (రూపమున) మీకు శత్రువు. మన్మథశత్రుత్వమున మీరీశ్వరులుగనుక, నేను, అచలజాతన్=పార్వతిని (స్థిరస్వభావముగలదానను) అన్నపూర్ణ(వ్రాలు).

3. శా. హేమాభాంగవిభాధరారుణిమ వ
క్త్రేందుప్రభాశ్రీలఁ ద
ద్భామారత్నము వొందదయ్యె మును త
త్తద్వర్ణయుక్తాఖ్యలన్;
శ్యామాత్వం బళి గర్వధూర్వహకచ
చ్ఛాయాచ్ఛటం గాంచెః నోఁ
గాకిమ్మున్నదె శిరఃప్రధానమను వా
క్యం బెమ్మెయిం దప్పునే?

—ఆముక్తమాల్యద, ౫ ఆ., ౮ ప.

తాత్పర్యము—ఆ చిన్నదానికి శరీరముయొక్క హేమవర్ణముఁబట్టి హేమయన్న పేరుకాని, పెదవి యొక్క యరుణవర్ణముఁబట్టి యరుణయన్న పేరుకాని, ముఖము యొక్క చంద్రవర్ణముఁబట్టి చంద్రయన్న పేరుకాని కలుగక, తుమ్మెదల గర్వము నణఁచు కురుల శ్యామ (నీల) వర్ణముఁబట్టి శ్యామయన్న పేరు ముందుగాఁ గలిగినది. (శ్యామయనఁగా యౌవనమధ్యస్థయైన స్త్రీ). అది సహజమే. సర్వావయవములలో శిరస్సు ప్రధానమని లోకములోఁ బూర్వమునుండియు నున్నమాట యెప్పుడును దప్పదు.